ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

గురువారం 12 డిసెంబరు 2024

### బొమ్మసంద్ర మెట్రో స్టేషన్‌కు డెల్టా ఎలక్ట్రానిక్స్ పేరు

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్‌సిటీ మార్గంలోని బొమ్మసంద్ర మెట్రో స్టేషన్‌కు తైవాన్ దేశానికి చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరును ఖరారు చేశారు. డెల్టా కంపెనీతో బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎంఆర్‌సీఎల్) ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే బొమ్మసంద్ర స్టేషన్ కోసం రూ.10 కోట్లు చెల్లించిన డెల్టా సంస్థ తాజాగా 55 కోట్ల రూపాయలు జమ చేసింది. దీంతో బొమ్మసంద్ర స్టేషన్‌కు డెల్టా ఎలక్ట్రానిక్స్ స్టేషన్‌గా పిలవనున్నారు. కో నప్పన అగ్రహారను ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్టేషన్‌గాను, హెబ్బగుడి స్టేషన్‌ను బయోకాన్ ఫౌండేషన్లు ఖర్చు చేశాయి. వారు కొన్నేళ్లపాటు స్టేషన్‌లను పర్యవేక్షిస్తారు.

## పరిశోధనలు, ఆవిష్కరణకు ప్రాధాన్యం

అంతర్జాతీయ చర్చాగోష్టిలో ప్రొ-చాన్సలర్ జవహర్ దొరస్వామి




7లో..

## మగ్గుతున్న ఎండుమిర్చి

ఏడాదిగా గోదాముల్లో నిల్వ భారీగా పడిపోయిన ధర బాడుగ చెల్లించలేమంటున్న అన్నదాతలు..



8లో..

## టెక్నాలజీ సద్వినియోగం కావాలి

పద్మవిభూషణ్ డాక్టర్ వీకే ఆత్రె ఐసీఎంఏఎంఎస్ అంశంపై చర్చాగోష్టి




7లో..

# ఎమ్మెల్యే ల్యాడ్స్.. వినియోగించరా...

- నత్తనడకన అభివృద్ధి పనులు
- నిధులున్నా.. వాడేవారేరీ?
- జూన్‌లో ప్రస్తావనకు అనుమతించని అధికారులు



బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పనులకు, అత్యవసరమైన అవసరాలను పరిష్కరించేలాంటి పనులకోసం శాసనసభ్యుల ప్రాంతీయ ప్రదేశాభివృద్ధి పథకం (ఎమ్మెల్యేల్యాడ్స్)కు ఉత్తమ అవకాశాలు ఉన్నా ఈ ఏడాది నత్తనడకన పనులు సాగుతున్నాయి. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2023 మేలో జరిగాయి. ప్రస్తుతానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. 224 శాసనసభ్యులతోపాటు 75మంది విధాన పరిషత్ సభ్యులకు ఏడాదికి కోట్ల రూపాయల చొప్పున కేటాయిస్తారు. ప్రస్తుతం ఎమ్మెల్యేకు కోటి రూపాయల చొప్పున విడుదల చేశారు. వీటికితోడు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1038 కోట్లు మిగులు ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ముగింపు వచ్చినా రూ.121.40 కోట్ల మొత్తంతో 2,468 పనులకు మాత్రమే అనుమతులు లభించాయి. ఇప్పటివరకు 2.49 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

### జూన్‌లోనే నివేదికలు ఇవ్వాలి

ఎమ్మెల్యే ల్యాడ్స్ ద్వారా శాసనసభ్యులు నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి జూన్‌లోనే జిల్లా అధికారులకు ప్రస్తావనలు నివేదిక రూపంలో ఇవ్వాలి. ఎమ్మెల్యేల ప్రస్తావనలకు జిల్లా అధికారులు గడువులోగా అనుమతులు ఇవ్వాలి. కానీ జూన్‌లో చేసిన ప్రస్తావనలకు ఇప్పటివరకు అనుమతులు ఇవ్వకపోవడం కూడా విమర్శలకు కారణమవుతోంది. ఎమ్మెల్యేల్యాడ్స్ గ్రాంట్లు తక్కువైనా స్థానికంగా ప్రజలకు అవసరమైన పనులు చేసేందుకు ఇదో ఉత్తమమైన అవకాశంగా ఉంటుంది. రోడ్లు, పాఠశాలల మరమ్మతులు, తాగునీరు సౌలభ్యం, మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసేందుకు కనీసం లక్ష రూపాయలకుపైగా, ప్రకృతి వైపరీత్యాల కారణంతో నిర్మాణాలకు రూ.25లక్షల వరకు అవకాశం ఉంది. ఈ నిధిని ఎమ్మెల్యేలు ప్రామాణికంగా ఉపయోగించుకుంటే నియోజకవర్గాలలో పెండింగ్ పనులతోపాటు అత్యవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు వీలుంటుంది.



శిథిలావస్థలో ఉన్న కలబురిగి జిల్లాలోని ఓ ప్రాథమిక పాఠశాల

### గరిష్ఠంగా రూ.25లక్షలకు వెసులుబాటు

ప్రకృతి వైపరీత్యాల ప్రదేశాలలో అత్యవసరంగా పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు గరిష్ఠంగా రూ.25లక్షల పనులకు సిఫారసు చేయవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు ఐదారు నెలలుగా నిరంతరంగా వర్షాలు కురుస్తుండడంతో ప్రతి నియోజకవర్గంలోనూ రోడ్లు అధ్వానంగా మారాయి. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. అత్యవసరంగా పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం ఉంది.

### రూ.1,038 కోట్లు వినియోగించుకునే అవకాశం

సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో తొలి ఏడాది 2023-24 ఎమ్మెల్యే ల్యాడ్స్ కింద రూ.1,264 కోట్ల గ్రాంట్లను విడుదల చేశారు. ఈ నిధులలో 218.23 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యింది. అంటే 17.36శాతం మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన 1,038 కోట్లు వినియోగించేందుకు అవకాశం ఉంది. అనుమతులు పొందిన పనులను ఏడాదిలోగా సాధ్యం కాకుంటే రెండో ఏడాదికి ఉపయోగించుకునేందుకు వెసులుబాటు ఉంది. గత ఆర్థిక సంవత్సర మిగులు గ్రాంటును ఈ సంవత్సరం సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంది. 2014 సవరించిన మార్గదర్శకాల ప్రకారం నిర్దిష్టమైన పనులను ఎంపిక చేసుకుని ఆ తర్వాత యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేయాలి. ఈ విధంగా కార్యాచరణ కొనసాగిస్తే రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు వెయ్యి కోట్ల రూపాయల పనులు చేసేందుకు వీలుంది.

- గ్యారెంటీ పథకాల ద్వారా గ్రాంట్లు లభించడం లేదని ఎమ్మెల్యేలు దాదాపు ఏడాది కాలంగా పలు సందర్భాలలో ఆరోపణలు చేశారు. ఇందుకు భిన్నంగా సీఎం సిద్దరామయ్య ప్రతి ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా రూ.25 కోట్ల గ్రాంటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీకి నెలలు గడుస్తోంది గానీ గ్రాంట్లు మాత్రం రాలేదు. కొంతమంది ఎమ్మెల్యేలకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు మాత్రమే సాధ్యమైంది. మరికొందరు ఎమ్మెల్యేలకు భారీగానే నిధులు మంజూరు చేశారు. అధికారపార్టీతో గుర్తింపు పొందిన బెంగళూరు నగర యశ్వంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్‌కు రూ.80కోట్లు విడుదల చేసినట్టు తెలుస్తోంది.
- ఎమ్మెల్యేల్యాడ్స్ ద్వారా చేపట్టదలిచిన పనులకు శాసనసభ్యులు జిల్లా అధికారులకు ముందుగా వినతులు పంపాలి. జిల్లా అధికారులు ప్రాథమికంగా వాటిని పరిశీలించి కాలపరిమితిలోగా జారీ చేయాలి. పాలనాపరమైన అనుమతులు లభించిన పనులకు 40శాతం ముందుగా గ్రాంట్లు విడుదల చేయాలి. పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, ప్రజాపనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలు, సమన్వయం, క్రియాశీలకంగా పనులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అనుకూలమయ్యేలా గ్రాంట్లను సకాలంలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎమ్మెల్యేలపై ఉంది.

### న్యూస్ బాక్స్

## ప్యాలెస్ రోడ్డు విస్తరణకు టీడీఆర్ ఇవ్వాలని సుప్రీం ఆదేశం

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారిరోడ్డు, జయమహల్ రోడ్ల విస్తరణకోసం స్వాధీనం చేసుకోదలిచిన బెంగళూరు ప్యాలెస్ మైదాన భూమికి శ్రీకంఠదత్తనరసింహరాజ ఒడయార్ వారసులకు కర్ణాటక రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం టీడీఆర్ ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వం, బీబీఎంపీలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. న్యాయ ఉల్లంఘన అర్జీల విచారణ వేళ న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, అరవింద్‌కుమార్‌ల ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడింది. ఈ వివాదం పరిష్కరించేందుకు ఇంకెంతకాలం జాప్యం చేస్తారని మందలించింది. రిజిస్ట్రేషన్ చట్టం 1957 ప్రకారం ట్రాన్స్‌ఫరబుల్ డెవలెప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) ఇవ్వాలని సూచించింది. రాష్ట్రప్రభుత్వం, బీబీఎంపీ అధికారులకు ఆరువారాల గడువు ఇచ్చింది. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు రోడ్ల విస్తరణకు వినియోగించదలిచారని తెలిపింది. లెక్కప్రకారం 15.39 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు 3వేల కోట్ల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించింది.

## ఏడాది సంబరాలకు రాయితీలు

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏడాది ఆఖరు అంటే సరదాగా గడిపేందుకు అన్నివర్గాల ప్రజలు ఉత్సాహం చూపుతారు. దక్షిణభారత్‌లోనే అతిపెద్ద అమ్యూజ్‌మెంట్‌పార్క్ వండర్‌లా క్రిస్మస్, నూతన సంవత్సరం కోసం ప్రత్యేక ఆఫర్‌లను ప్రకటించింది. ఈనెల 21నుంచి జనవరి 5వరకు రాయితీలు వర్తిస్తాయని వండర్‌లా ఎండీ అరుణ్ కే చిట్టిలపిల్లి ప్రకటించారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వు చేసుకునేవారికి పార్క్ టిక్కెట్‌తోపాటు ఫుడ్ కొనుగోలులో 30శాతం రాయితీ కల్పిస్తున్నట్టు తెలిపారు. ఫుడ్ ఫెస్టివల్‌తోపాటు ఇతరత్రా సౌలభ్యాలు ఉంటాయని ప్రకటించారు.

## హోల్‌సేల్ ధరకే 'రీగల్'లో కోరుకున్న నగలు




మాట్లాడుతున్న రీగల్ జ్యువెలర్స్ నిర్వాహకులు

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళలో సుదీర్ఘకాలంగా సొంత మాన్యుఫాక్చరింగ్ కలిగిన రీగల్ జ్యువెల్స్ సంస్థ తొలిసారి బెంగళూరులో షోరూం తెరవనున్నట్టు ఎండీ విబిన్ దాస్ తెలిపారు. బుధవారం బెంగళూరు కమ్మనహళ్ళిలో షోరూంలో మీడియాతో మాట్లాడారు. హోల్‌సేల్ ధరలకు మేకింగ్‌చార్జ్ నిర్ణయించిన విధంగానే రిటైల్ కొనుగోలుదారులకు వర్తింపచేస్తామన్నారు. ఇప్పటివరకు హోల్‌సేల్ మేకింగ్ చార్జ్ విధానంతో ఎవరూ ఆభరణాలను అందుబాటులోకి తీసుకురాలేదన్నారు. కేరళలో 8 షోరూంలు ఉన్నాయన్నారు. సొంత రాష్ట్రం తర్వాత బెంగళూరు మార్కెట్ అనుకూలమని ఇక్కడ దేశ విదేశీయులు నివసిస్తారని అందరికీ నాణ్యమైన నగలు అందించాలన్నదే మా లక్ష్యమన్నారు. మా కొత్త విధానం కర్ణాటకలోనే తొలిసారి అమలు చేస్తున్నామన్నారు. ఈనెల 13న షోరూం ప్రారంభం కానుందని ఆభరణాల ప్రేమికులు షోరూంను సందర్శించాలన్నారు. సంస్థ జనరల్ మేనేజర్ గోపాల్, స్టోర్ మేనేజర్ సంతోష్‌లు పాల్గొన్నారు.

# లింగాయత వ్యతిరేకి ముఖ్యమంత్రి

- మఫ్టీ పోలీసులే రాళ్లు రువ్వారు
- బసవజయ మృత్యుంజయ స్వామీజీ
- పంచమశాలీలకు 2ఏ రిజర్వేషన్లు ఇవ్వరాదు
- రాష్ట్ర బీసీ కులాల సమాఖ్య

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లింగాయత వ్యతిరేకి ముఖ్యమంత్రి అని, పంచమసాలిలకు 2ఏ రిజర్వేషన్ కల్పించాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వం సానుకూలంగా లేదని కూడలసంగమ పీఠాధిపతి బసవజయ మృత్యుంజయస్వామీజీ ఆరోపించారు. బుధవారం బెళగావిలో స్వామీజీ మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా సాగుతున్న నిరసనలో మఫ్టీ పోలీసులే రాళ్లు రువ్వి పథకం ప్రకారం వ్యవహరించారని మండిపడ్డారు. లింగాయత పోరాటాన్ని భగ్నం చేయాలనేది వారి కుట్రగా ఉందన్నారు. అమాయకులపై దాఖలు చేసిన కేసులను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. నిరసనలో చట్ట ఉల్లంఘన జరిగి ఉంటే జలఫిరంగులు ప్రయోగించాల్సి ఉండేదన్నారు. అయితే ప్రభుత్వమే పోలీసుల చేత రాళ్లు రువ్వించి అమాయకులపై లాఠీచార్జ్ జరపడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి లాఠీ చార్జ్ చేయాలని సూచించకుంటే అందుకు పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై దౌర్జన్యం చేసిన ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన పోరాటహక్కును అణగదొక్కిందన్నారు. సీఎం సిద్దరామయ్యను నిరసన శిబిరం వద్దకు వచ్చి మా సమస్యలు వినాలని కోరామన్నారు. ముగ్గురు మంత్రులు వచ్చారని కానీ సీఎం రావాలని డిమాండ్ పెట్టామన్నారు. భారీస్థాయిలో వచ్చిన లింగాయతల వినతిని స్వీకరించేందుకు సీఎం రాకపోవడం విచారకరమన్నారు.

**రిజర్వేషన్లు ఇవ్వరాదు:** పంచమశాలీ లింగాయతలకు 2ఏ రిజర్వేషన్ ఎట్టి పరిస్థితుల్లోనూ కల్పించరాదని రాష్ట్ర బీసీ కులాల సమాఖ్య సీఎంను కోరింది. 2002 నుంచి బీసీ కులాలకు 2ఏ, 2బీ, 3ఏ, 3బీ వర్గీయులుగా విభజించి ప్రవర్గ ఒకటికి నాలుగుశాతం, 2ఏకు 15శాతం, 2బీకి 4శాతం, 3ఏకు 4శాతం, 3బీకి 5శాతంతో కలిపి మొత్తం 32శాతాన్ని వెనుకబడినవర్గాలకు రిజర్వు చేశారు. పంచమసాలి లింగాయతలు ప్రవర్గ 3బీ ద్వారా రిజర్వేషన్ పొందుతున్నారని, 2ఏకు మార్పు చేస్తే బీసీ వర్గాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2ఏ కోటాలో చేర్చరాదని డిమాండ్ చేశారు. ఈ కోటాలో రజకులు, సవితా సమాజ, తిగళ, ఈడిగ, కురుబ, దేవాంగ వర్గీయులకు అన్యాయం జరుగుతుందన్నారు. పంచమసాలిలకు 2ఏ రిజర్వేషన్ అమలు చేస్తే తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న బసవజయ మృత్యుంజయ స్వామీజీ

**ఐదుగురిపై ఎఫ్‌ఐఆర్:** బెళగావిలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనపై పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు 17మందికి గాయాలు, ఏడు ప్రభుత్వ బస్సులు, 3 పోలీసు వాహనాలు ధ్వంసం కావడంపై హిరేబాగేవాడి పోలీసులు సుమోటోగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. నింగప్ప బనద్, రామగౌడ ఫకీరగౌడ, ఉమేశ్ ఇంగళవార్, మంజునాథ్ బెండగేరి, మంజునాథ్ గుమ్మగోళపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు.



ఎస్ఎం కృష్ణ భౌతికకాయం వద్ద సీఎం సిద్దరామయ్య నివాళి



మద్దూరు తాలూకాలో దారి పొడవునా అభిమానుల గౌరవం (ఇన్‌సెట్‌లో) ఎస్ఎం కృష్ణ పార్థివదేహం



బెంగళూరు నివాసం వద్ద ఎస్ఎం కృష్ణ పార్థివదేహానికి కుటుంబీకుల నివాళులు



ఎస్ఎం కృష్ణ నివాసం వద్ద...

# పంచభూతాలలో లీనమైన ఎస్ఎం కృష్ణ

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాలలో కురువృద్ధుడు ఎస్ఎం కృష్ణ పంచభూతాలలో లీనమయ్యారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత కృష్ణను సొంతూరు మండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్ళిలో అధికార లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు జరిపారు. ఉదయం 8 గంటలకు బెంగళూరు సదాశివనగర్ నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పార్థివదేహాన్ని ఉంచి తరలించారు. మైసూరు రోడ్డు మీదుగా కెంగేరికి చేరుకోగా పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చి కడచూపు చూశారు. బిడదిలో వైకుంఠయాత్ర వాహనంపై పూలు చల్లి నివాళులు అర్పించారు. బిడది నుంచి మద్దూరు దాకా రోడ్డుకు ఇరువైపులా అభిమానులు భారీగా తరలివచ్చి ఎస్ఎం కృష్ణ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. సోమనహళ్ళికి పార్థివదేహం చేరుకోగా కాసేపు స్థానికుల కడచూపుకోసం అవకాశం కల్పించారు. అనంతరం బెంగళూరు - మైసూరు జాతీయ రహదారికి అనుబంధంగా కెఫె కాఫీ డే సమీపంలోని ఖాళీస్థలంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియల ప్రక్రియ ప్రారంభించారు. గాలిలోకి పోలీసులు మూడు రౌండ్ల కాల్పులు జరిపి గౌరవం సమర్పించారు. అనంతరం జాతీయజెండాను పోలీసు అధికారులు తొలుత ముఖ్యమంత్రికి అనంతరం ఎస్ఎం కృష్ణ భార్య ప్రేమకృష్ణకు అప్పగించారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, కుమారస్వామి, మాజీ సీఎంలు యడియూరప్ప, బసవరాజ్ బొమ్మై, మంత్రి చలువరాయస్వామి, శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ, ప్రతిపక్షనేత ఆర్ అశోక్ చివరగా సంతాపం తెలిపారు. ఎస్ఎం కృష్ణ మనవడు అమర్త్య సిద్దార్థహెగ్డే సంప్రదాయాలు పాటించారు. ఒక్కలిగ సామాజిక విధివిధానాలతో ప్రక్రియ కొనసాగించారు. చితికి అమర్త్య నిప్పుపెట్టారు. ఒక టన్ను శ్రీగంధం చెక్కలతోపాటు 300 కేజీల పూలు, నెయ్యి అంత్యక్రియలకు ఉపయోగించారు.

**ప్రముఖుల నివాళులు :** మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, సుధాకర్, మహదేవప్ప, వెంకటేశ్, లక్ష్మీహెబ్బాళ్కర్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, జేడీఎస్ పక్షనేత సురేశ్‌బాబు, మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, డీసీఎం డీకే శివకుమార్ భార్య ఉషా, కుమార్తె ఐశ్వర్య, కుమారుడు ఆకాశ్, ఎస్ఎం కృష్ణ కుమార్తెలు మాళవిక, శాంభవి, అల్లుడు ఉమేశ్‌తోపాటు ఎల్ఆర్ శివరామే గౌడ, ప్రొఫెసర్ కృష్ణగౌడ, అభిషేక్ అంబరీశ్ సహా పలువురు పాల్గొని నివాళులు అర్పించారు.



స్వామీజీల నివాళి, చిత్రంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



సీఎం సిద్దరామయ్య గౌరవ వందనం



పోలీసుల గౌరవవందనం





**ప్రగతి బాట**

అమరావతిలో బుధవారం జరిగిన కలెక్టర్ల సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లాకు చెందిన మంత్రులు సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, సవిత. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి భోజనం చేస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న ఇతర ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు. రెండో రోజు ఉమ్మడి జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై సమగ్ర సమీక్ష ఉంటుంది.



## ఉపాధిలో అగ్రస్థానమే లక్ష్యం

■ డ్వామా పీడీ సలీంబాషా



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపడమే లక్ష్యమని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. ఉపాధి పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీ వివరించారు.

ఇంటర్వ్యూ

**ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి...?**

**పీడీ:** జిల్లాలో 3.08లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 5.66లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 1.26లక్షలు, ఎస్టీ 10,150 జాబ్‌కార్డులు ఉండగా, దివ్యాంగులకు 3826 జాబ్‌కార్డులు ఉన్నాయి.

**ప్రశ్న: జిల్లాకు ఈ ఏడాది ఎన్ని పనిదినాలు కేటాయించారు..?**

**పీడీ:** జిల్లాకు 95లక్షల పనిదినాలు కేటాయించారు. ఇప్పటి వరకు 86లక్షల పనిదినాలు పూర్తి చేశాం. రూ.226కోట్లు ఉపాధి కూలీలకు, రూ.104కోట్లు మెటీరియల్ కింద చెల్లించాం.

**ప్రశ్న: ఉపాధి కింద ఏయే పనులు చేపడుతున్నారు...?**

**పీడీ:** ఈ ఏడాదిలో పాడి రైతులకు షెడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతలు తవ్వడం, ఫారంపాండ్ల నిర్మాణం, సీసీ రోడ్లు వేయడం, డ్రైల్యాండ్ హార్టికల్చర్, పశుగ్రాస క్షేత్రాలు, పల్లె వనాలు, అటవీకరణ, తోపుల పెంపకం చేపడుతున్నాం.

**ప్రశ్న: జిల్లాలో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పరిస్థితి ఏంటి..?**

**పీడీ:** ప్రధానంగా డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కలకు ధరలు పెంచారు. 7500ఎకరాల లక్ష్యానికి గాను 9094ఎకరాలకు మొక్కలు అందజేశాం. రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచింది. మొక్కల పెంపకం, నీటి నిర్వహణకు లబ్ధిదారులైన రైతులకు ప్రభుత్వమే బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమచేస్తుంది.

**ప్రశ్న: ఫారంపాండ్ల నిర్మాణం ఎలా ఉంది...?**

**పీడీ:** ఫారంపాండ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉంది. జిల్లాకు 515సేద్యపు నీటికుంటలు కేటాయించగా...ఇప్పటి వరకు 440పూర్తి చేశాం. వీటితో పాటు ఇంకుడు గుంతల నిర్మాణంలో 283కి గాను 180పూర్తి చేశాం. ఇంకుడు గుంతల నిర్మాణంలో 209కి గాను 203పూర్తి చేశాం.

**ప్రశ్న: పశువుల షెడ్ల నిర్మాణం పురోగతి ఎలా ఉంది...?**

**పీడీ:** ఈ ఏడాదిలో కొత్తగా పశువులు, గొర్రెలు, మేకల పెంపకానికి సంబంధించి షెడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇందులో 1475కి గాను 113పూర్తి కాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయి. త్వరలో మిగిలినవి కూడా పూర్తి చేసి పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం.

**ప్రశ్న: జిల్లాలో వాటర్‌షెడ్ పరిస్థితి ఎలా ఉంది...?**

**పీడీ:** జిల్లాలో వాటర్‌షెడ్ పనులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జరుగుతున్నాయి. గోళ్ళ, శింగనమల, రాప్తాడు హంపాపురంలో జరుగుతున్నాయి. తాజాగా రాప్తాడు మండలం హంపాపురం వాటర్‌షెడ్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం జిల్లాకు ఎంతో పేరు తీసుకువచ్చింది. ఇదే స్ఫూర్తితో వాటర్‌షెడ్ పనులు మరింత నాణ్యతగా చేపడుతాం.



ఉపాధి కూలీలు

# సంఘం.. శరణం..!

**7 ఏళ్లుగా అడహాక్ కమిటీ**






- సిబ్బంది సమస్యలు పట్టని నేతలు
- ఒత్తిళ్లకు బలవుతున్న కిందిస్థాయి ఖాకీలు
- పోలీసు అధికారుల సంఘం తీరుపై విమర్శలు

● 'ఒక పని చేసిపెట్టు..' అని అనంతపురం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్‌పై ఆ విభాగం పై అధికారి నాలుగు నెలల క్రితం తీవ్ర ఒత్తిడి చేశారు. భరించలేక ఆ హెడ్‌కానిస్టేబుల్ సెలవు పెట్టి వెళ్లారు.

● సరెండర్ లీవులు, బకాయిలు ఇవ్వాలని కోరుతూ ఏఆర్ విభాగం కానిస్టేబుల్ ప్రకాష్ ఏడాదిన్నర క్రితం డిమాండ్ చేశారు. అప్పటి సీఎం జగన్ జిల్లాకు వచ్చిన సందర్భంలో ప్లకార్డు పట్టుకుని పోలీసు అమరవీరుల స్తూపం ఎదుట బైఠాయించారు. అప్పటి నుంచి అతని మీద యుద్ధం ప్రకటించారు. ఉన్నతాధికారులు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించారు. కేసులు పెట్టి వేధించారు. చివరకు డిస్మిస్ చేశారు.




పోలీస్ అమరవీరుల స్తూపం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రకాష్ (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులు ఎదుర్కొనే ఉద్యోగులకు వారి సంఘాలు అండగా నిలుస్తాయి. న్యాయం జరిగేలా చూస్తాయి. కానీ పోలీసు అధికారులు సంఘం మాత్రం ఇలాంటి పనిచేయదని బాధితులు వాపోతుంటారు. సెలవులో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్‌కు, డిస్మిస్ అయిన ఏఆర్ కానిస్టేబుల్‌కు అండగా నిలవకపోవడం ఇందుకు నిదర్శనం. జిల్లాలో చాలామంది బాధితులు ఉన్నారు. ఎస్ఐ, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. సంఘం వారి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

### ఎవరి కోసం..?

జిల్లా పోలీసు అధికారుల సంఘం ఆ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. కానీ ఉన్నతాధికారుల సేవకే పరిమితమౌతోందని విమర్శలు ఉన్నాయి. హోం గార్డు మొదలు ఏఎస్ఐ స్థాయివారి గురించి సంఘం అస్సలు పట్టించుకోదనే ఆరోపణలు చాలా సంవత్సరాలుగా ఉన్నాయి. ఏదో నోటిమాటతో అయిపోయే విషయాలపై మాత్రమే, అదీ కొందరికోసమే స్పందిస్తారని బాధితులు అంటున్నారు. అధికారుల ఒత్తిళ్లు, ఇతరత్రా సమస్యలు ఉంటే.. ఆ సమస్య ఎవరిదైనా పట్టించుకోరని వాపోతున్నారు. పోలీసు అధికారుల సంఘం నేతల స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందిలాగే వ్యవహరిస్తారు. యూనిఫాం వేసుకోవడం వారికి చికాకు అన్నట్లు ప్రవర్తిస్తారు. డీజీపీ వచ్చినప్పుడో, కొత్తగా ఎస్పీ బాధ్యతలు తీసుకునే సమయంలోనో మినహా.. వారి ఒంటిపై ఖాకీ దుస్తులు కనిపించవు. పోలీసు సిబ్బంది మృతి చెందిన సమయంలో పోలీసు లాంచనాలతో వారి అంత్యక్రియలు నిర్వహిస్తారు. అక్కడ కూడా వీరు యూనిఫాంలో కనిపించరు.

### సత్కరించడమే పనా..?

ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం, చిన్న పని చేస్తే సత్కరించడమే సంఘం విధి అన్నట్లుగా తయారైంది. వైసీపీ హయాంలో పోలీసులకు డీఏ, సరెండర్ లీవులు తదితర సమస్యల గురించి సంఘం పట్టించుకున్న దాఖలాలు లేవు. వైసీపీ అధికారంలోకి రాకముందు పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు అని ఆ పార్టీ అధినేత ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక కొన్ని నెలలు మాత్రమే అమలు చేసి.. అటకెక్కించారు. దీని గురించి కూడా ప్రశ్నించలేదు. కనీసం వినతిపత్రం ఇవ్వలేదు. ప్రశ్నించేవారికి పోలీసు అధికారుల సంఘంలో చోటు ఉండదనే ప్రచారం ఉంది. అందుకే హోదా ఉంటే చాలు.. సమస్యల గురించి ప్రస్తావించి ఇబ్బంది పడటం ఎందుకని మిన్నకుండిపోతున్నారని ప్రచారం ఉంది. ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్‌ను శాఖ పరంగా తీవ్ర ఇబ్బందులు పెట్టారు. రుజువులు లేని కేసులో ఇరికించి డిస్మిస్ చేశారు. అందరి సమస్యలపై గళం విప్పినందుకు ఉద్యోగాన్ని పోగొట్టుకున్నాడు. అతనిపట్ల కనీస సానుభూతి చూపించలేదు. కాపాడే ప్రయత్నం అస్సలు చేయలేదు. సంఘం జోక్యం చేసుకుని ఉంటే.. ప్రకాష్‌కు ఆ పరిస్థితి ఎదురయ్యేదా..?

### ఏడేళ్లుగా అడహాక్ కమిటీ


పోలీస్ అధికారుల సంఘం పేరుతో ఒకే కమిటీ ఏడేళ్లుగా నడుస్తోంది. ఒకే కమిటీ ఇన్నేళ్లు కొనసాగడం విమర్శలకు తావిస్తోంది. తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకపోవడంపై పోలీస్ అధికారుల సంఘం మాజీ అధ్యక్షుడు శివానంద ఏడేళ్ల క్రితం కోర్టును ఆశ్రయించారు. దీంతో ఎన్నికలపై కోర్టు స్టే విధించింది. అప్పటి నుంచి పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీతోనే నడుస్తోంది. తాత్కాలిక కమిటీని ఏడేళ్లుగా, ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగించడం ఏమిటని పోలీసు శాఖ అధికారులు, సిబ్బందే ప్రశ్నిస్తున్నారు. కొత్త కమిటీ ఎన్నికైతే కొంతైనా మార్పు ఉంటుందని వారు అంటున్నారు. పోటీ ఉంటే పోలీస్ సిబ్బంది సమస్యలపై పోరాడే నాయకత్వం వస్తుందని అంటున్నారు. అండగా నిలబడే సంఘం కోసం పోలీసు బాధితులు ఎదురుచూస్తున్నారు.



హెడ్‌కానిస్టేబుల్ అంత్యక్రియల్లో యూనిఫాం లేకుండా నిల్చున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు(ఫైల్)

## రూ. 1000కి ఏమొస్తుంది..?

### డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ సమస్య



- మార్కెట్‌లో కొనడానికి నగదు అందజేత ?
- రూ.వెయ్యి ఇచ్చేందుకు నిర్ణయం
- బయటి మార్కెట్లో ధర రూ.2వేల పైమాటే
- ఆందోళనలో అభ్యర్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ రాష్ట్ర అధికారులు అనాలోచిత నిర్ణయాలతో డీఎస్సీ ఉచిత శిక్షణ సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిక్షణ సమయంలో అభ్యర్థులకు అందించే స్టైఫండ్, మెటీరియల్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నారు. డీఎస్సీ మెటీరియల్‌కు సంబంధించి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు పట్టించుకోకుండా కేవలం రూ.1000 అని నిర్ణయించేశారు. శిక్షణ అందించే ఫ్యాకల్టీ పారితోషికం విషయంలోనూ అదే నిర్లక్ష్యాన్ని వహించారు. వారికి సెషన్‌కి కేవలం రూ.600 అని చెప్పి ఆదేశాలు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు, ఫ్యాకల్టీ సిబ్బంది ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారు.



**మెటీరియల్‌కు బదులు డబ్బు**

గతంలో బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అందించే డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి ఆ శాఖాధికారులే స్టడీ మెటీరియల్‌ను అందించేవారు. అభ్యర్థులు ఆ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకునేవారు. వీటికి తోడు స్టైఫండ్ సైతం అందించేవారు. ఈసారి మాత్రం ఆ శాఖ రాష్ట్ర అధికారులు అభ్యర్థులకు స్టైఫండ్ నెలకు రూ. 1500 ఇవ్వడం లేదు. అలాగే మెటీరియల్‌కు బదులు నగదును అందించేందుకు శ్రీకారం చుట్టారు. ఒక్కో అభ్యర్థికి రూ.వెయ్యి చొప్పున అందించనున్నట్లు తెలిపారు. అయితే బహిరంగమార్కెట్లో మెటీరియల్ ధర చాలా ఎక్కువగా ఉంది. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన మెటీరియల్ దాదాపు రూ. 2500 వరకూ ఉంది. ఎస్‌జీటీలకు సంబంధించిన మెటీరియల్ ధర రూ. 3 వేలకుపైమాటే. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.వెయ్యితో ఏమి కొనుక్కోవాలని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

**ఫ్యాకల్టీకి ఆరు వందలే..**

బీసీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ ఇచ్చే ఫ్యాకల్టీకి అందించే పారితోషికంలోనూ కోత పెట్టారు. సెషన్‌కు రూ. 600లు మాత్రమే ఇస్తున్నారు. బయటి కోచింగ్ సెంటర్లలో సెషన్‌కు రూ. 2వేలు, రూ. 3వేలు ఇస్తున్నారు. దీంతో ఇక్కడ కోచింగ్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో నిపుణులైన ఫ్యాకల్టీని పిలుచుకుని వచ్చేందుకు బీసీ స్టడీ సర్కిల్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. బలవంతంగా ముగ్గురు, నలుగురు ఫ్యాకల్టీలతో నెట్టుకొస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**గైడ్‌లైన్స్ మేరకే...**

రాష్ట్ర అధికారులు ఇచ్చిన మార్గదర్శకాల మేరకే ఉచిత డీఎస్సీ శిక్షణను అమలు చేస్తున్నాం. మెటీరియల్‌కు సంబంధించిన మొత్తాన్ని అభ్యర్థుల ఖాతాలకు జమ చేసేలా రాష్ట్ర అధికారులు నిర్ణయించారు. అభ్యర్థులకు మేము మెటీరియల్ ఇవ్వడం లేదు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకే స్టైఫండ్‌తో పాటు మెటీరియల్‌కు సంబంధించిన రూ. వెయ్యి ఖాతాలకు జమవుతుంది.

**- కుష్బూ కొఠారీ, డైరెక్టర్, బీసీ స్టడీసర్కిల్**

## ప్రభుత్వ బియ్యాన్ని అమ్ముకోరాదు



రాప్తాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజనం రుచి చూస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

**ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి**

రాప్తాడు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఉచిత బియ్యాన్ని అమ్ముకోరాదని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని కేజీబీవీ, రాప్తాడు ఉన్నత పాఠశాల, గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రం, రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు కిలో రూ. 45 ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేసి రాష్ట్రంలోని దాదాపు 4 కోట్ల మంది ప్రజలకు బియ్యం అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందించే బియ్యాన్ని ప్రజలు చులకనగా చూస్తూ కిలో రూ. 13కే అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వం అందించే బియ్యం ఎంతో నాణ్యతగా ఉంటాయని, మంచి విటమిన్లు ఉంటాయన్నారు. ఆ బియ్యం అమ్ముకోకుండా రాగిముద్ద, పిండి వంటలు, దోసెలు, వడియాలు, టిఫిన్‌లకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రజలు అమ్మిన బియ్యాన్ని వ్యాపారస్థులు సన్న బియ్యంగా మార్చి విదేశాలకు విక్రయిస్తున్నారన్నారు. ఆ సన్న బియ్యం తిరిగి ప్రజలు రూ. 60 కొంటున్నారన్నారు. కేజీబీవీలో మధ్యాహ్న భోజనం బాగుందని తెలిపారు. గంగలకుంట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. రాప్తాడు ఉన్నత పాఠశాలలో కూర నీళ్లగా ఉందని భోజన నిర్వాహకులను మందలించారు. కార్యక్రమంలో జీసీడీఓ వాణిదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీడీపీఓ ధనలక్ష్మి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఎస్ఓ రమేష్ బాబు, ఎంఈఓ మల్లికార్జున, హెచ్‌ఎం సాంబశివ, ఎస్ఓ ముత్యాలమ్మ, డాక్టర్ శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బేడబుడగల సమస్యలు పరిష్కరించండి

**కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి ఎంపీ వినతి**

అనంతపురం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రెటరీ అమిత్ యాదవ్‌ను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఢిల్లీలో బుధవారం ఆయన బేడ, బుడగ సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. 16 సంవత్సరాలుగా ఎలాంటి కుల ధ్రువీకరణ పత్రం పొందకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్న బేడ, బుడగ కులస్థులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. బేడ, బుడగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయం చేసేందుకు 2017లో సీఎం చంద్రబాబునాయుడు జేసీ శర్మ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ కమిషన్ అన్ని జిల్లాలో పర్యటించి 2018లో నివేదికలు సమర్పించిందన్నారు. 2019లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఆ నివేదికలు పంపిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బేడ, బుడగ కులస్థులకు ఎస్సీ సర్టిఫికెట్లు అందేలా చూడటంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వం సోషల్ జస్టిస్ సెక్రటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

## వదాన్య డీఎస్సీ హాల్ టిక్కెట్లు విడుదల

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే డీఎస్సీ ఎస్‌జీటీ మెగా గ్రాండ్ టెస్ట్‌కు సంబంధించిన హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచే హాల్‌టిక్కెట్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2110 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డిసెంబరు 29న కొత్తచెరువులో పరీక్ష నిర్వహిస్తామన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన మొదటి 50 మందికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా అంతేనా..?

**ఏపీఓ నాగరాజుపై చర్యలేవీ..?**

- తేలిగ్గా తీసుకున్న విద్యాశాఖ అధికారులు
- ఏఎస్ఓ పోస్టు కట్టబెట్టే యత్నం



అనంతపురం విద్య, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఇష్టారాజ్యం నడుస్తోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ అధికార పార్టీ ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ పాలనలో జిల్లా విద్యాశాఖలోకి ఏపీఓగా వచ్చిన నాగరాజుపై గతంలో ఉపాధ్యాయుల నుంచి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన విషయాన్ని ఆరాతీసి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సెప్టెంబరు నెలలో లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. 'ఏపీఓ నాగరాజు ఉపాధ్యాయుల సర్దుబాటులో మిగులు ఉపాధ్యాయులకు మంచి స్థానాలు కావాలంటే నన్ను కలవండి. మంచి ప్లేస్ ఇప్పిస్తానంటూ టీచర్ల నుంచి కొంత మొత్తం తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందని' ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీచర్లు అదే స్కూల్‌లో కొనసాగాలన్నా కూడా తనను సంప్రదిస్తే చాలు అంటూ ఏపీఓ మోసం చేస్తున్నారంటూ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే రెండు మాసాలు కిందటే అధికార పార్టీ ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా...ఇప్పటి వరకూ ఏపీఓపై జిల్లా విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**కమిషనర్ చెప్పినా.. కదిలించరా...?**

వైసీపీ పాలనలో నాగరాజు ఏపీఓగా డీఈఓ ఆఫీస్‌కు వచ్చారు. గత ప్రభుత్వంలో వచ్చిన ఉపాధ్యాయులను కదిలించి కొత్త వాళ్లను తీసుకోవాలంటూ విద్యాశాఖ కమిషనర్ అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఇదే విషయాన్ని ఇటీవల కూడా కమిషనర్ డీఈఓలను ఆదేశించారు. ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా, విద్యాశాఖ కమిషనర్ చెప్పినా జిల్లా విద్యాశాఖాధికారులు పెడ చెవిన పెట్టడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఏపీఓగా పనిచేస్తున్న ఆయనను కీలకమైన అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులో కూర్చోబెట్టాలని కొందరు గట్టిగా పైరవీలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఆ దిశగా ఫైల్‌ను కదిలిస్తున్నట్లు సమాచారం.



## శబరిమలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ మీదుగా శబరిమలకు సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు-కొల్లాం ప్రత్యేక రైలు (నం. 07181) జనవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి 11-45 గంటలకు గుంటూరులో బయలుదేరి 6, 13, 20 తేదీల్లో ఉదయం 6-20 గంటలకు కొల్లాంకు చేరుకుంటుందన్నారు. అలాగే కొల్లాం-గుంటూరు ప్రత్యేక రైలు (నం. 07185) జనవరి 13, 20 తేదీల్లో ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 4 గంటలకు గుంటూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైళ్లు నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, గిద్దలూరు, దిగువమిట్ట, నంద్యాల, బేతంచెర్ల, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లి, పీలేరు, పాకాల, చిత్తూరు, కాట్పాడి, జోలార్‌పట్టె, సేలం, ఈరోడ్, తిరుప్పూరు, పొదనూరు, పలక్కడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, తిరువల్ల, చెంగనూరు, కాయంకుళం స్టేషన్ల మీదుగా వెళ్తాయన్నారు. కొల్లాం-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు (నం. 07182) జనవరి 2న ఉదయం 10-45 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 10 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కాయంకుళం, చెంగనూరు, తిరువల్ల, కొట్టాయం, ఎట్టుచలయెర్, ఎర్నాకులం టౌన్, అలువ, త్రిసూర్, పలక్కడ్, పొదనూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పట్టె, కాట్పాడి, చిత్తూరు, పాకాల, పీలేరు, మదనపల్లి, కదిరి, ధర్మవరం, అనంతపురం, గుత్తి, డోన్, బేతంచెర్ల, నంద్యాల, దిగువమెట్ట, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, దొనకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

## వైద్యులు.. సిబ్బందికి మెమో



రోగితో మాట్లాడుతున్న డీసీహెచ్ డాక్టర్ రవికుమార్

శింగనమల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ విధులకు గైర్హాజరైన ఐదుగురు వైద్యులు, నలుగురు వైద్య సిబ్బందికి డీసీహెచ్ డాక్టర్ పాల్ రవికుమార్ మెమో జారీ చేశారు. సీహెచ్‌సీనిఆయన బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఆసుపత్రిని పరిశీలించారు. ఔషధాల కొరత, సిబ్బంది పని తీరు గురించి విచారించారు. ఆస్పత్రిలో 24 గంటలు సేవలు అందించాలని, కానీ వైద్యులు, సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని అన్నారు. రాత్రి సమయంలో వైద్యులు విధులకు సరిగా హాజరు కావడం లేదని అనానరు. రోగుల పట్ల వైద్య సిబ్బంది అనుచితంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కుంచె...

### ఫ్రాంక్ సినాత్రా (జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో పేరొందిన నటుడు, అమెరికన్ దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఫ్రాన్సిస్ అల్బర్ట్ సినాత్రా 1915 డిసెంబరు 12న న్యూజెర్సీ ప్రాంతంలో జన్మించారు. అమెరికన్ గాయకుడు, నటుడు, నిర్మాతగా రాణించడమేగాక మ్యూజికల్ ఆర్టిస్ట్‌గా సైతం సత్తా చాటుకున్నారు. ఆయన దర్శకత్వంలోని పాటల క్యాసెట్‌లు, సీడీలు ప్రపంచ వ్యాప్తంగా అమ్ముడయ్యాయి. 11 గ్రామీ అవార్డులు, ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం, అకాడమీ అవార్డు, ఇతర గౌరవాలు పొందారు. 1998 మే 14న కన్నుమూశారు.

### గొల్లపూడి మారుతీరావు (వర్ధంతి)




ఇంటిపేరుతో పేరొందిన గొల్లపూడి మారుతీరావు 1939 ఏప్రిల్ 14న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరంలో జన్మించారు. రచయిత, నటుడు, సంపాదకుడు, వ్యాఖ్యాత, పాత్రికేయుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఉపసంపాదకుడిగాను వ్యవహరించారు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు పలు విశ్వ విద్యాలయాలలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నిర్వహించిన అనేక పోటీలకు జ్యూరీ సభ్యులలో ఒకరిగా ఉన్నారు. రేడియో ప్రయోక్తగా, అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. నంది అవార్డుల తోపాటు పలు పురస్కారాలు పొందారు. 2019 డిసెంబరు 12న కన్నుమూశారు.

### 'షావుకారు' జానకి (పుట్టినరోజు)



'షావుకారు' సినిమాలో నటించి అదే పేరుతోనే గుర్తింపు పొందిన శంకరమంచి జానకి 1931 డిసెంబరు 12న రాజమండ్రిలో జన్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, మళయాళం భాషలలో 400కుపైగా సినిమాలలో నటించారు. అంతకు ముందు 300కుపైగా నాటకాలలో రాణించి కళాకారిణిగా, రేడియో ఆర్టిస్ట్‌గా గుర్తింపు పొందారు. అరిజోనా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. జాతీయ, రాష్ట్ర తెలుగు సినిమా అవార్డుల కమిటీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. పద్మశ్రీ, నంది, రాజ్యోత్సవ, కళైమామణి, వండర్ ఉమన్, జయలలిత స్పెషల్ కళైమామణి అవార్డు తదితర అవార్డులు పొందారు.

### శరద్‌పవార్ (పుట్టినరోజు)



'పద్మ విభూషణ్' గ్రహీత శరద్ గోవిందరావ్ పవార్ 1940 డిసెంబరు 12న మహారాష్ట్రలోని బారామతి ప్రాంతంలో జన్మించారు. ఐదు దశాబ్దాలుగా రాజకీయాలలో తనదైన ముద్ర వేశారు. మహారాష్ట్రకు మూడుసార్లు ముఖ్యమంత్రిగాను, కేంద్రమంత్రిగా వివిధ హోదాలలో కొనసాగారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) సంస్థాపక అధ్యక్షులు. విద్యా ప్రతిష్ఠాన్ ద్వారా గ్రామీణ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించారు. బారామతి చుట్టుపక్కల ప్రాంతాలలో ఐటీ, బీటీ రంగాన్ని ప్రోత్సహించారు. క్రీడల్లోనూ తనదైన ఆసక్తితో బీసీసీఐ సహా వివిధ విభాగాలలో కొనసాగారు.

### రజనీకాంత్ (పుట్టినరోజు)



తమిళ సినీరంగంలో సూపర్ స్టార్‌గా పేరొందిన 'పద్మవిభూషణ్' గ్రహీత రజనీకాంత్ 1950 డిసెంబరు 12న బెంగళూరులో జన్మించారు. అసలు పేరు శివాజీ రావ్ గైక్వాడ్. నిర్మాతగా, స్క్రీన్ రైటర్‌గాను రాణించారు. మంత్రాలయ రాఘవేంద్ర స్వామి భక్తుడు, ఆధ్యాత్మిక భావాలు కలిగినవారు. సీబీఎస్ఈ సిలబస్‌లోనూ పాఠ్యాంశం కలిగిన ఏకైక నటుడిగా చెప్పవచ్చు. దాదాసాహెబ్ ఫాల్కే, తమిళ నాడు రాష్ట్ర అవార్డు, ఫిల్మ్‌ఫేర్ సహా పలు పుర స్కారాలు అందుకున్నారు. సామాజికసేవల్లోనూ గుర్తింపు పొందారు.

### యువరాజ్ సింగ్ (పుట్టినరోజు)



క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో అన్ని ఫార్మాట్‌లలోనూ ఆడి 'పద్మశ్రీ' పురస్కారం పొందిన యువరాజ్ సింగ్ 1981 డిసెంబరు 12న జన్మించారు. బ్యాటింగ్‌లోనూ, ఫీల్డింగ్‌లోనూ ప్రత్యేకత సాధించారు. 2011 ఐసీసీ వరల్డ్ క్రికెట్ కప్‌లోనూ కీలకంగా ఆడారు. 2014లో ఫిక్కీచే స్ఫూర్తిదాయక క్రీడాకారుడిగా అవార్డు పొందారు. 2019లో అర్జున అవార్డు అందుకున్నారు. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించి స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి ప్రత్యేకించి కేన్సర్ బాధితులకు చేయూత ఇస్తున్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఫీచర్ ఫిల్మ్స్‌పై దృష్టి సారించారు.

## రైతు పోరాటాలకు ప్రజలు అండగా నిలవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకురాలు ఉమాదేవి

రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కర్ణాటక రైతు సంఘం, హసిరుసేన చేస్తున్న పోరాటానికి ప్రజలు అండగా నిలవాలని కర్ణాటక రైతు సంఘం రాష్ట్ర సంచాలకురాలు ఉమాదేవి కోరారు. బుధవారం నగరంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ రైతుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాతమాడుతున్నట్లు ఆరోపించారు. రైతు పట్టాల పొలాలకు సంబంధించిన పహణిల్లో వక్ఫ్ బోర్డు పేర్లు నమోదవుతున్నాయని, ఇలాంటి వాటిని ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం కర్ణాటక రైతు సంఘం, హసిరుసేన 13న బెళగావి చలో అసెంబ్లీ ఆందోళన చేపట్టాయని, ఇందుకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

# సైన్స్ అండ్ టెక్నాలజీ సద్వినియోగం కావాలి

**పద్మవిభూషణ్ డాక్టర్ వీకే అత్రె**




చర్చాగోష్ఠిలో పద్మవిభూషణ్ డాక్టర్ వీకే అత్రె తదితరులు

బెంగళూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైన్స్ అండ్ టెక్నాలజీ వేగవంతంగా ప్రగతి సాధిస్తోందని అవి సమాజంలో సద్వినియోగం అవసరమని ప్రముఖ శాస్త్రవేత్త పద్మవిభూషణ్ డాక్టర్ వీకే అత్రె అభిప్రాయపడ్డారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అమెరికా టెక్సాస్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐసీఎంఏఎంఎస్ అంశంపై చర్చాగోష్ఠిలో డాక్టర్ వీకే అత్రె మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వమంతటా ప్రగతిదశలో ఉందన్నారు. ఈ పరిణామం వేగవంతమైన మార్పులకు కారణమవుతోందన్నారు. వైర్‌లెస్ టెక్నాలజీతో దేశ విదేశీయులను కలుపుతోందన్నారు. సూపర్ కంప్యూటర్ అభివృద్ధి చెందిందని, సాంకేతిక ప్రగతి సాధిస్తున్న దశలో సమస్యలు, అనుకూలం రెండూ ఉన్నాయన్నారు. మనం మంచి మార్గానికి సద్వినియోగం చేసుకుందామన్నారు. గోకుల ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం, టెక్సాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జేఎస్ రెడ్డి, ఇటలీ, పాలిటెక్నిక్ డి టొరినో కళాశాల ప్రొఫెసర్ ఎరినో కెరీరా, గోకుల ట్రస్టు గౌరవ కార్యదర్శి ఎంఆర్ రామయ్య ఎంఆర్ శ్రీనివాసమూర్తి, సలహాదారుడు కరిసిద్దప్ప, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఆర్ నాయుడు, సీఈఓ డాక్టర్ హెచ్‌వీ పార్శ్వనాథ్‌లు ఉన్నారు. విద్యార్థులకు అనుకూలంగా ఉండాలనే స్కిల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గోకుల ఎడ్యుకేషన్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు.

## భక్తిభావంతో సన్మార్గంలో సాగండి



యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్‌స్వామిజీతో స్థానిక ప్రముఖులు

**తలకాయలబెట్టలో యదుగిరి పీఠాధిపతి**

శిడ్లఘట్ట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భక్తిభావంతో సన్మార్గంలో సాగాలని మేలుకోటె యదుగిరి పీఠాధిపతి యదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్‌స్వామిజీ ప్రజలకు పిలుపునిచ్చారు. శిడ్లఘట్ట తాలూకాలోని తలకాయల బెట్టను సందర్శించారు. కొండపై కొలువైన భూనీళా సమేత వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ వెయ్యేళ్లక్రితమే సమాజంలోని అసమానత, తారతమ్యాలు, మూఢనమ్మకాలపై రామానుజాచార్యులు పోరాటం చేశారన్నారు. మనమంతా ప్రతిరోజూ భగవంతుడి నామాన్ని జపం చేయడం ద్వారా భక్తిప్రపత్తులు అలవరుచుకోవాలన్నారు. తద్వారా భగవంతుడి కృపతో సమాజంలో మంచికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాజీవ్‌గౌడ మాట్లాడుతూ వచ్చే బ్రహ్మ రథోత్సవాలకు తిరుమల తరహాలో 16లక్షల రూపాయలతో శంఖుచక్రాల నామాల తరహాలో ఎల్‌ఈడీ బల్బులను అమర్చడంతోపాటు చుట్టుపక్కల రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక ప్రముఖుడు డీపీ నాగరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా రాజీవ్‌గౌడ, పుట్టు ఆంజినప్ప తదితరులు పాల్గొని స్వామిజీకి ఆత్మీయ స్వాగతం పలికారు.

# పరిశోధనలు.. ఆవిష్కరణలకు ప్రాధాన్యం




సదస్సులో ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి తదితరులు

బెంగళూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు, ఆవిష్కరణలను ఉత్తేజపరిచేందుకు పీఈఎస్ యూనివర్సిటీ నిరంతరంగా ప్రాధాన్యత ఇస్తోందని ప్రొ-చాన్స్‌లర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీలో కంప్యూటర్ సొసైటీ బెంగళూరు చాప్టర్ భాగస్వామ్యంతో డేటా, డెసిషన్ అండ్ సిస్టమ్స్ మూడు రోజుల అంతర్జాతీయ చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ వాస్తవిక ప్రపంచంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు సాంకేతికత ఎంతో దోహదపడుతోందని అకడమిక్, ఇండస్ట్రీకి మధ్య ఉండే సంబంధాలు అనుకూలమైతే భవిష్యత్తులో ఉద్యోగాలతోపాటు పరిశ్రమల ప్రగతి సులభతరం అవుతుందన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రొఫెసర్, ఐఈఈఈ బెంగళూరు చాప్టర్ విభాగం డాక్టర్ టీ శ్రీనివాస్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత ఆధునిక పరిశోధనలపై పలు అంశాలను ప్రస్తావించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ శ్రీధర్, ఇంజనీరింగ్ టెక్నాలజీ విభాగం డీన్ డాక్టర్ బీకే కేశవన్, పరిశోధన విభాగం డీన్ డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు. హ్యాకి 24, సిలికాన్ రష్ 2.0 విజేతలను ప్రత్యేకంగా సత్కరించారు. ఐటీరంగానికి చెందిన వివిధ యూనివర్సిటీల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు.

## సొంతఖర్చుతో గుంతల పూడ్చివేత

దొమ్మసంద్ర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా పరిధిలోని హాలనాయకనహళ్ళి గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లపై ఏర్పడిన గుంతలను పంచాయతీ అధ్యక్షురాలు సవితా బాబురెడ్డి, సభ్యులంతా చేరి సొంత ఖర్చుతో పూడ్చారు. దొడ్డకన్నళ్ళి, ఎలక్ట్రానిక్‌సిటీకి వెళ్లే మార్గం పలుచోట్ల గుంతలు ఏర్పడడంపై ప్రజాప్రతినిధులు స్పందించారు. ఆదర్శ బిల్డర్ జయశంకర్, మైత్రి బిల్డర్ అనిల్, కిశోర్, కిరణ్ తదితరులు సుమారు రెండున్నర కిలోమీటర్ల కంకర వేసి డాంబరీకరణ చేసి రోడ్డును బాగు చేశారు. కార్యాచరణలో గ్రామపంచాయతీ ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, వెంకటేశ్, అనిల్‌కుమార్, శ్వేతా సురేశ్, శివారెడ్డి, మునిరెడ్డి, మంజునాథ్, గీతా లోకేశ్, ప్రదీప్, సుకన్యాహరిబాబు, మంజునాథ్, శోభారమేశ్, రవిశంకర్, శోభా లోకేశ్, అనితా భీమణ్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు సొంత ఖర్చుతో రోడ్డును బాగుచేయడంపై ప్రజలనుంచి ప్రశంసలు వ్యక్తం అవుతున్నాయి.



రోడ్ల పనుల కార్యాచరణలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు

## ప్రజల సహకారంతో నేర నియంత్రణ



నేరాల నియంత్రణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బంగారపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమని బంగారపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ దయానంద్ అభిప్రాయపడ్డారు. కెజిఎఫ్ పోలీసు జిల్లా 2024 సంవత్సరానికి నేరాల నియంత్రణ మాసోత్సవంలో భాగంగా బుధవారం ద్విచక్రవాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు బంగారపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో లాడ్జ్ యజమానులు, మేనేజర్‌లు సహకరించాలని కోరారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు ఇవ్వరాదన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. కాగా వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలసంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు.

## కట్నం వేధింపుల కేసులో ఏడాది జైలు

అనంతపురం క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించిన భర్తకు కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. 2015లో వెన్నపూస సౌభాగ్యలక్ష్మికి రాజీవ్‌కాలనీకి చెందిన బ్రహ్మానందరెడ్డితో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ.5లక్షలు కట్నంగా ఇచ్చారు. అయితే రూ.10లక్షల అదనపు కట్నం తీసుకురావాలని ఆమెను బ్రహ్మానందరెడ్డి, అతడి తల్లి లక్ష్మీదేవి, తండ్రి ఆదిరెడ్డి, సోదరుడు చెన్నారెడ్డి, సోదరి కృష్ణకుమారి మానసికంగా, శారీరకంగా వేధించారు. ఈ విషయంపై సౌభాగ్యలక్ష్మి 2016 ఫిబ్రవరి 28న త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు పంపడంతో పాటు కోర్టులో చార్జిషీట్ వేశారు. కేసు విచారించిన మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్ మొదటి ముద్దాయి బ్రహ్మానందరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. మిగిలిన నలుగురిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టి వేశారు. ఈ కేసును ఏపీపీ శ్రీనివాసులు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన ఆనంద్(45)బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు ఆనంద్ స్థానికంగా ఓ చికెన్ సెంటర్‌లో పని చేసేవాడు. ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించి కారణాలు ఆరాతీశారు. భార్యతో గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయని మృతుడి అన్న ఈశ్వరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మృతిపై భార్యతోపాటు మరో వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య రాజమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

## బియ్యం పట్టివేత

పామిడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండూరు రోడ్డు పక్కన ఓ మామిడి తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, సీఐ జమాల్‌బాషా తెలిపిన మేరకు... రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై నిరుపేదలకు సరఫరా చేస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమంగా మామిడి తోటలో నిల్వ చేశారని సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సుమారు 200 బస్తాల రేషన్ బియ్యంను కనుగొన్నామన్నారు. వెంటనే ఆ బియ్యాన్ని సీజ్ చేసి, సీఎస్‌డీటీ కంబక్కకు అప్పగించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరంతర అభ్యసనతో ఉత్తీర్ణత సాధించాలి

● మానసిక నిపుణుడు అబ్దుల్ జావీద్

రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి గురికాకుండా నిరంతర అభ్యాసంతో పరీక్షలను విజయవంతంగా ముగించాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు అబ్దుల్ జావీద్ సూచించారు. సహారా ఏజెన్సీ, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని రంగమందిరంలో ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) విద్యార్థుల కోసం ప్రత్యేక అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితం, ఆంగ్లం పట్ల కొంత బెరుకు ఉండి, అందుకు దూరంగా ఉంటారని అది సరైన పద్ధతి కాదన్నారు. ప్రయత్నాన్ని పదేపదే సాగించడం వల్ల మరింత సులభతరంగా ఆ రెండు సబ్జెక్టులను అధిగమించవచ్చన్నారు.



మాట్లాడుతున్న మానసిక నిపుణుడు అబ్దుల్ జావీద్

## ఎస్ఎం కృష్ణకు ఘన నివాళులు

శిడ్లఘట్ట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ మృతి పట్ల కన్నడ సాహిత్య పరిషత్, వివిధ సంఘాలు, తాలూకా సమాన మనస్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో భావపూర్ణ శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణంలోని కోటె సర్కిల్‌లో ఎస్ఎం కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 2004లో శిడ్లఘట్టకు ఎస్ఎం కృష్ణ విచ్చేసి మినీ విధానసౌధను ప్రారంభించడమే కాక అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకాన్ని ప్రారంభించిన విషయాన్ని స్మరించుకున్నారు. పురసభ మాజీ సభ్యుడు జీవీ సురేశ్, కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షులు వీ కృష్ణ, ఎం కెంపణ్ణలు ప్రసంగించారు. కార్యక్రమంలో విజ్ఞమ్ నాగరాజ్, ఉపాధ్యాయులు సత్యనారాయణరావ్, జిల్లా రాజ్యోత్సవ పురస్కార గ్రహీత అంబారి మంజునాథ్, సుందర్, కదంబ సేన తాలూకా అధ్యక్షుడు, కళాకారుడు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



కోటె సర్కిల్‌లో నివాళులు అర్పిస్తున్న స్థానిక ప్రముఖులు

## 14న బెంగళూరు వాకథాన్



వాకథాన్ వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

బెంగళూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమర్థనం ట్రస్టు, ఓపెన్ టెక్స్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 14న జయనగర్‌లోని కిత్తూరు రాణి చన్నమ్మ మైదానంలో 18వ వార్షిక బెంగళూరు వాకథాన్ నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం సమర్థనం ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ మహంతేశ్, ఓపెన్ టెక్స్ట్ ఇండియా ఎండీ మనోజ్ నాగ్‌పాల్‌లు వాకథాన్ టీ షర్టులను, పోస్టర్లను ప్రెస్‌క్లబ్‌లో లాంఛనంగా విడుదల చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకుని వాకథాన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అందరికీ ఆరోగ్యమనే థీమ్‌తో వాకథాన్ నిర్వహిస్తున్నట్టు వివరించారు.

## మార్కెట్‌లోకి టయోటా హైబ్రీడ్ ఈవీ

బెంగళూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లగ్జరీ వాహనాల తయారీలో పేరొందిన టయోటా కిర్లోస్కర్ సంస్థ అత్యాధునిక సౌలభ్యాలతో కామ్రీ హైబ్రీడ్ ఎలక్ట్రికల్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. బెంగళూరులో బుధవారం టయోటా సేల్స్ అండ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్, చైర్మన్ అండ్ సీఈఓ మసాకజు యోషిమురా, వైస్ చైర్మన్ మానసి టాటా, డీఎండీ టడాశి అసాజుమాలు విడుదల చేశారు. సీఎండీ మాట్లాడుతూ లిథియం అయాన్ బ్యాటరీతో ఫిఫ్త్ జనరేషన్ హైబ్రీడ్ టెక్నాలజీగా వాహనం ఉందన్నారు. ఎనర్జిటిక్ బ్యూటీ పరికల్పనతో డేటా కమ్యూనికేషన్ మాడ్యూల్, అత్యాధునికమైన సౌలభ్యాలు ఉన్నాయన్నారు.

## 11 కళాశాలలకు నోటీసులు


రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న 11 కళాశాలలకు నెల రోజుల గడువు ఇస్తూ నోటీసులు జారీ చేసినట్లు రాయచూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్ వనికాళ తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శంకర్ వనికాళ, రాయచూరు, యాదగిరి జిల్లాలకు చెందిన అన్ని డిగ్రీ కళాశాలలను విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం పరిశీలించినట్లు తెలిపారు. 11 కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులు కనీస సౌకర్యాలు లేనట్లు గుర్తించామని వాటిని సమకూర్చుకునేందుకు నెల రోజులు గడువు ఇచ్చినట్లు తెలిపారు.

## మద్యం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

గోరంట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దలకుంట పల్లికి చెందిన వెంకటేష్ కు మద్యం అక్రమ రవాణా కేసులో పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మూ డేళ్ల జైలుశిక్ష, రూ.2.01 లక్షల జరిమానా విధించినట్లు సీఐ శేఖర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెంకటేష్ 2021 నవంబరు 6న కర్ణాటక నుంచి 75 టెట్రాప్యాకెట్ల కర్ణాటక మద్యంతోపాటు 25 గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా అప్పటి సీఐ జయనాయక్ అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు. 2023లో చార్జిషీట్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయాధికారి బొజ్జప్ప. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.







## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1629.40 | 1,591.32 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 5,182 | 701 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 5,387 | 2,484 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 91.83 | 12.17 |

## అంబేడ్కర్ స్వాభిమాన సేన అధ్యక్షుడిగా చెన్నప్ప



అధ్యక్షుడు చెన్నప్పకు అర్హత పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్

కంప్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం అంబేడ్కర్ స్వాభిమానసేన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోదండరామ్ సీపీ చెన్నప్పను జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కంప్లి, కురుగోడు తాలుకాలలో ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయనకు ఈ బాధ్యతలు అప్పటించినట్లు తెలిపారు. సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. సమాజసేవ చేయడంలోనే సంఘాలకు గుర్తింపు ఉంటుందన్నారు. సిద్దప్ప మాట్లాడుతూ తనపై నమ్మకం వుంచి అధ్యక్ష స్థానాన్ని అప్పగించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. మున్ముందు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్య అధ్యక్షులు ఆనందకుమార్, రామచంద్ర, రాజేంద్రబాబు, సంతోష్, గాయత్రి, అనిల్ కుమార్, శివకుమార్, మంజునాథ్, రాఘవేంద్ర, తిప్పేష్, రంగస్వామి, ఈసన్న, ఇబ్రహీమ్, మంజునాథ్ పాల్గొన్నారు.

## ఇందిరా క్యాంటీన్ ప్రారంభం ఎప్పుడో?



నిరుపయోగంగా ఉన్న ఇందిరా క్యాంటీన్ భవనం

సిరుగుప్ప, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇందిరా క్యాంటీన్ ప్రారంభానికి నోచుకునేదెన్నడని ప్రజలకు ప్రశ్నిస్తున్నారు. సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా క్యాంటీన్ ఏర్పాటుకు భవనాన్ని నిర్మించింది. ఈ భవనం నిర్మాణం పూర్తయి ఏడాది గడిచినా ప్రారంభానికి నోచుకోలేదు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు క్యాంటీన్‌ను ఏర్పాటు చేసింది. అధికారుల నిర్లక్ష్యంతో ఇంతవరకు క్యాంటీన్ ప్రారంభించకపోవడం సిగ్గుచేటని ప్రజలు విమర్శిస్తున్నారు.

## ఆహార భద్రత కల్పించాలి



జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న భారత్ జనవాది మహిళా సంఘం

బళ్లారి సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆహార భద్రత కల్పించాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని అఖిల భారత జనవాది మహిళా సంఘం బళ్లారి కమిటీ జిల్లా కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా కార్యదర్శి చంద్రకుమారి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతుండడంతో పేద కుటుంబాలపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. మహిళలు జీవనోపాధి అవకాశాలు క్షీణించడం, ఆదాయం తగ్గిపోవడం, తలసరి ఆహార వినియోగం గణనీయంగా తగ్గి ఆకలి, పోషకాహార లోపాలనికి దారితీసిందన్నారు. విషాదకరంగా కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కూడా ఈ తీవ్రమైన సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పంపిణీ(పీడీఎస్) తక్షణమే సార్వత్రీకరించాలని, బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షులు తరంగిణి, జిల్లాకమిటీ సభ్యులు రుద్రమ్మ, మంగమ్మ, అరుణ, కెంగల్ ఈరమ్మ పాల్గొన్నారు.

# మగ్గుతున్న ఎండుమిర్చి..!

- ఏడాదిగా గోదాముల్లో నిల్వ
- భారీగా పడిపోయిన ధర
- బాడుగ చెల్లించలేమంటున్న అన్నదాతలు
- రూ.కోట్లలో నష్టపోతున్న గోదాముల యజమానులు

"రైతు పేరు తిమ్మారెడ్డి. తుంగభద్ర నీటి ద్వారా 20 ఎకరాల్లో మిరప సాగు చేశాడు. 2023 ఖరీఫ్ సాగులో పంట బాగా వచ్చింది. అప్పుడు రేటు కొంత తగ్గింది. రేటు వస్తుందనే ఆశతో గోదాముల్లో స్టాక్ పెట్టాడు. స్టాక్ పెట్టినప్పుడు అప్పటి క్వింటాల్ రేటు రూ.45 వేలు వరకూ ఉండేది. ఇంకా మంచి రేటు వస్తుందనే భావనతో నిల్వ చేశారు. కానీ ఇప్పుడు ఏకంగా మిరప రేటు రూ.6 వేలకు పడిపోయింది."

బళ్లారి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):ఇది తిమ్మారెడ్డి అనే రైతుది ఒక ఉదాహరణ మాత్రమే. బళ్లారి, కొప్పళ, రాయచూరు, విజయనగర జిల్లాల్లో లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. బళ్లారి జిల్లాలో 33 వరకూ వేర్‌హౌసులు, హొస్పేట్‌లో 21, రాయచూరులో 18, కొప్పళలో 28 ఉన్నాయి. వీటిలో రైతులు పండించిన వివిధ పంటదిగుబడులు నిల్వ చేశారు. ఒక్కొక్క వేర్ హౌస్‌లో కనీసం 50,000 వేల మెట్రిక్ టన్నుల వరకు నిల్వ చేసుకోవచ్చు. 2023 ఏడాది తుంగభద్ర డ్యాం కింద బ్యాడిగి, గుంటూరు లాంటి మిరప రకాలను నిల్వ చేశారు. ఈ నాలుగు జిల్లాల్లో లక్షల మెట్రిక్ టన్నుల ఎండుమిర్చి గోదాముల్లో స్టాక్ ఉన్నాయి.

● గోదాముల్లో రైతులు పెట్టిన స్టాక్ మొత్తానికి అప్పటి మార్కెట్ రేటు అంచనా వేసి బ్యాంకర్లు లోన్లు ఇస్తారు. అంటే అప్పుడు మార్కెట్ ధర క్వింటాల్ రూ.45 వేల ఉంటే ఇందులో సగం అంటే రూ.22.500 లోన్ ఇచ్చారు.



కల్లంలో ఉండిపోయిన మిరప దిగుబడి



గోదాముల్లో నిల్వ ఉన్న ఎండుమిర్చి

దీన్ని రైతులు మిరప పంటను విక్రయించాక బ్యాంకర్లతో తీసుకున్న రుణం చెల్లించి మిగిలిన డబ్బులు తీసుకుంటారు. ఇందుకు రైతు పాస్‌పుస్తకం, స్టాక్ పెట్టిన మొత్తం తీసుకుని గోదాముల యజమాని తో స్టాక్ పెట్టినట్లు ఒప్పంద పత్రం మీద సంతకం తీసుకుంటారు. బ్యాంకుకు రైతులకు మధ్యలో గోదాముల యజమాని సాక్షంగా ఉంటారు.

### అసలు సమస్య ఇక్కడి నుంచే మొదలు..

రేటు పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం క్వింటాలు రూ.6 వేలు కూడా లేదు, దీనితో రైతులు అమ్ముకునేందుకు ముందుకు రావడం లేదు. కనీసం గోదాముల వైపు కూడా చూడటం లేదు. బ్యాంకర్లు నోటీసులు గోదాముల యజమానులకు ఇస్తున్నారు. రైతుల నిల్వలను అమ్మినా బ్యాంకర్లతో అప్పుడు తీసుకన్న రుణాన్ని చెల్లించేందుకు డబ్బులు రావడం లేదు. దీంతో రైతులతో పాటు గోదాముల యజమానులు కూడా ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకర్లకు కూడా పై అధికారుల నుంచి రికవరీ ఒత్తడి పెరుగుతుండడంతో గోదాముల్లో ఉన్న స్టాక్‌ను జప్తు చేసుకునేందుకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇలా మిరప ధర పూర్తిగా పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గోదాముల యజమానులు కూడా బ్యాంకర్లు పెడుతున్న ఒత్తిడి తట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకర్లు కూడా రికవరీ చేయకుంటూ పై అధికారులతో నోటీసులు, డిమోషన్లు పొందుతూ ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎప్పుడు రేటు వస్తుందో..? ఎప్పుడు పడిపోతుందో తెలియక రైతులు అయోమయంలో పడ్డారు.

### ఊహించలేదు..



నాకు 20 ఎకరాల ఆకయట్టు ఉంది. 2023లో మిరప పంట పెట్టాను. అప్పుడు రూ.45 వేల వరకూ బ్యాడిగి మిరపకు రేటు ఉండేది. ప్రస్తుతం రూ.6 వేలకు పడిపోయింది. అమ్ముదామంటే కనీసం గోదాములకు కట్టేందుకు బాడుగ కూడా రాదు. బ్యాంకులో తీసుకున్న అడ్వాన్స్ కూడా చేతి నుంచి కట్టాలి. ఇంత రేటు తగ్గిపోతుందని అనుకోలేదు. ఎండుమిర్చి మార్కెట్ యార్డు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

- రైతు మల్రిస్వామి, రాంపుర

## నేటి నుంచి హాకీ పోటీలు




మాట్లాడుతున్న హాకీ అసోసియేషన్‌అధ్యక్షులు నాగార్జునరెడ్డి

బళ్లారి సిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు బళ్లారి హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు నాగార్జునరెడ్డి తెలిపారు. నగరంలోని హాకీ మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి 15వ తేదీ వరకు అంతర్ జిల్లా సబ్ జూనియర్ హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర కర్ణాటకను జోన్‌వన్‌గా ఏర్పాటు చేశారు. ఈ టోర్నీలో ధార్వాడ్, రాయచూరు, బాగల్‌కోట్, కల్బుర్గి, హావేరి, గదగ్, బళ్లారి జట్లు పాల్గొంటాయి. లీగ్, నాకౌట్ విధానంలో మ్యాచ్‌లు నిర్వహించి డిసెంబరు 14న సెమీఫైనల్స్, 15న ఫైనల్స్ జరగనున్నాయన్నారు. ఇక్కడ గెలిచిన జట్లు బెంగళూరు జోన్-2తో తలపడుతుందన్నారు. మొత్తం 15 మ్యాచ్‌లు డే/నైట్‌లో జరుగుతాయన్నారు. ఫైనల్ మ్యాచ్ 15న సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామన్నారు. క్రీడాశాఖ సహాయ సంచాలకులు గ్రేసీ టోర్నీని ప్రారంభిస్తారని, చివరి రోజు అతిథిగా అర్జున్ అవార్డు గ్రహీత రఘునాథ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. బళ్లారి జట్టుకు కోచ్‌గా శ్రీధర్‌బాబు, మేనేజర్‌గా సయ్యద్ సైఫుల్లా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ కృష్ణారెడ్డి, శివానంద్, మహేశ్, షాషావలి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



ప్రమాదానికి కారణమైన లారీ

గంగావతి రూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన లారీ మోటారు సైకిల్‌ను ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన గంగావతి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కూలీ పనుల కోసం గంగావతి పట్టణానికి మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వీరిని గంగావతి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతి చెందిన వారిలో మరకుంబి గ్రామానికి చెందిన మంజునాథ పరసప్ప నాయక్(38), భార్య నేత్రావతి (33)గా గుర్తించారు. కూలీ పనుల కోసం వెళుతున్న వీరు హేరూరు-కెసరహట్టిల మధ్య ఉన్న ఒక పెట్రోల్ బంకులో పెంట్రోల్ వేయించుకుని రోడ్డుపైకి వస్తున్న సమయంలో వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు గంగావతి రూరల్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## సాగునీరు కలుషితం

కంప్లి, డిసెంబరు 11(ఆంధ్ర జ్యోతి): కంప్లి తాలుకా శ్రీరామ రంగాపురం వన్నళ్లి, మానెళ్లి, దరోజీ గ్రామాల పరిధిలోని వాగులు, కాలువల్లో నీరు కలుషితమవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం కంప్లి పరిధిలోని శ్రీరామరంగాపురం గ్రామంలోని వాగులు, కాలువల్లో కేపీసీఎల్ యాష్ నీరు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. రైతు సుధాకర్ మాట్లాడుతూ కలుషితమైన నీరు పొలానికి ఉపయోగిస్తే పంటలు పూర్తిగా నష్టపోతామన్నారు. కేపీసీఎల్ అధికారులు వెంటనే లీకేజీ అవుతున్న నీరుని అరికట్టాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే పంటలు నష్టపోతామన్నారు.



రామప్ప వాగులో పారుతున్న కలుషిత నీరు

## అధికార పార్టీ ప్రోద్బలంతోనే పోలీసుల దాడి

● బీజేపీ నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

బళ్లారి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ కోసం పంచమసాలి కులస్తులు చేస్తున్న ఉద్యమంపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం వెనుక సీఎం సిద్దరామయ్య ప్రోద్బలం ఉందని బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అనీల్ నాయుడు, డాక్టర్ ఎస్‌జేవీ మహిపాల్, డాక్టర్ బీకే సుందర్, కేఆర్ మల్లేష్, ఏడీవీ స్వామి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పంచమసాలి కులస్తులను 2ఏ క్యాటగిరీలో చేర్చాలని కోరుతూ బెళగావిలో ధర్నా చేస్తున్నారని అన్నారు. ధర్నాలో పాల్గొన్న మఠాధిపతులను, కులస్తులపై దాడులు చేయడం వెనుక సీఎం ప్రోద్బలం ఉందని వారు ఆరోపించారు. ఇందుకు బహిరంగంగా సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే హనుమంతుడి జన్మస్థలం అయిన అంజనాద్రి బెట్టను హంపీ తరహాలో అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఇప్పటికే పీఎం నరేంద్రమోదీ రూ.24 కోట్లు నిధులు ప్రకటించారని, మిగిలిన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

## వైభవంగా మహారథోత్సవం



అలంకరణలో స్వామివారు

సిరుగుప్ప, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైభవంగా హాళేకోట వీరభద్రేశ్వర స్వాముల జాతర, మహారథోత్సవం బుధవారం నిర్వహించారు. తాలుకాలోని హాళేకోట గ్రామంలో ప్రతి ఏడాది డిసెంబరు మాసం దశమి రోజున వీరభద్ర మహాస్వాముల జాతర, మహారథోత్సవం నిర్వహించడం ఆనవాయితాగా వస్తోందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి గ్రామ పురవీధుల్లో స్వామివారి మహారథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ అర్చకులు వీరభద్రేశ్వర స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, ప్రత్యేకాలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహారథోత్సవానికి పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు బళ్లారి, కొప్పళ, రాయచూరు ప్రాంతాల నుంచే కాక ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు.



గ్రామ వీధుల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

## ఘనంగా బెట్టద బసవేశ్వర రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకా మాడగిరి గ్రామంలో వెలసిన బెట్టద బసవేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన రథోత్సవం వైభవంగా సాగింది. మంగళవారం రాత్రి ప్రభోత్సవం నిర్వహించిన భక్తులు బుధవారం రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో లాగారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## పీడీఓ పూర్ణిమపై సస్పెన్షన్ వేటు

రాయచూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా ఆర్‌హెచ్ క్యాంప్ 1వ గ్రేడ్ పంచాయతీ అభివృద్ధి అధికారి పూర్ణిమపై సస్పెన్షన్ వేటు విధిస్తూ జడ్పీ ముఖ్య కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23, 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల మేరకు పీడీఓపై ఈ చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి పూర్ణిమాపై ఫిర్యాదు ఉండగా జడ్పీ సీఈఓ సెప్టెంబరు మొదటి వారంలో విచారణకు ఆదేశించారు. 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జడ్పీ అకౌంటింగ్ అధికారుల బృందం ఆరోపణపై విచారణ జరిపి నిధుల దుర్వినియోగం జరిగినట్లు నివేదిక అందజేశారు. దీని ఆధారంగా పీడీఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయగా ఆమె ఇప్పటి వరకు సమాధానం ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ వేటు విధించారు.

## అంతర్ జిల్లా పోటీల్లో విజేతలుగా నిలవాలి



ఎంపికైన క్రీడాకారులతో కోచ్‌లు, అధికారులు

రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో నిర్వహించే అంతర్ జిల్లా హాకీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విజేతలుగా నిలవాలని రాయచూరు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్ర జల్దార్ ఆకాంక్షించారు. 15వ తేదీ వరకు బళ్లారి జిల్లా కేంద్రంలో నిర్వహించే హాకీ పోటీల కోసం జిల్లా నుంచి క్రీడాకారులు బుధవారం తరలివెళ్లారు. రవీంద్ర జల్దార్ మాట్లాడుతూ జిల్లాలో హాకీ వైభవాన్ని మరింత పెంచేలా క్రీడాకారులు తమ ప్రతిభతో రాణించాలన్నారు.

## బాలమందిర్‌కు పిల్లల అప్పగింత

రాయచూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేంద్ర బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న 9 మంది బాలలను బాలల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలమందిర్‌కు అప్పగించారు. భిక్షాటనతోపాటు చిత్తుకాగితాలు ఏరుకుంటున్న బాలలను గుర్తించిన అధికారులు వారిని బాలమందిర్‌కు తరలించారు. పోలీసులు, బాల కార్మిక నియంత్రణ విభాగం అధికారులు బాల కార్మిక పరిరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కూలీల ఆటో బోల్తా

● ఒకరికి తీవ్రగాయాలు

యల్లనూరు, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిర్రమ్మబావి సమీపంలో బుధవారం తెల్లవారుజామున కూలీలను తీసుకువెళ్తున్న ఆటో బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పుట్లూరు మండలం గోపరాజుపల్లికి చెందిన గోపాల్ మరో పదిమంది కలిసి ఆటోలో కడపజిల్లా బలపనూరుకు తోట చుట్టూ ఫెన్సింగ్ వేసే పనికి బయల్దేరారు. గిర్రమ్మబావి సమీపం లోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణి స్తున్న గోపాల్ తీవ్రంగా గాయపడగా మిగిలిన వారు స్వల్పగాయాలతో బయటప డ్డారు. క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# హోసూరు జోన్

## హోసూరు యూనియన్‌లో కలెక్టర్ పర్యటన

● అభివృద్ధి పనుల తనిఖీ

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు పంచాయతీ యూనియన్ పరిధిలో కలెక్టర్ సరయు బుధవారం పర్యటించి పలు పథకాలకింద చేపట్టి అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించారు. తొరపల్లి అగ్రహారం పంచాయతీలో కళాకారుల కలల గృహ నిర్మాణ పథకం క్రింద లబ్ధిదారులు మాలశ్రీ, ఐషాబాను, నాగమ్మలు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఇంజనీర్లను ఆదేశించారు. అనంతరం వన్నలవాడీ పంచాయతీ జొనబండ గ్రామంలో నాబార్డు ప్రాజెక్టు 2024-25 క్రింద రూ.18.42లక్షలతో పూర్తి చేసిన 30 వేల లీటర్లు సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ వాటర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. అలాగే బేగేపల్లి పంచాయతీలో నాబార్డు పథకం క్రింద నిర్మిస్తున్న 44 వేల లీటర్ల సామర్థ్యం కల్గిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను, బేగేపల్లి యూనియన్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విధానాన్ని వీక్షించారు. అనంతరం అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. తనిఖీలో ఐసీడీఎస్ అధికారి జయంతి, జిల్లా అభివృద్ధి అధికారి బాలాజీ తదితరులు ఉన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

## ఆదర్శప్రాయుడు భారతీయార్



ప్రోత్సాహకాలతో విద్యార్థినులు

హోసూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళ రచయిత భారతీయార్ ఆదర్శప్రాయులని వక్తలు అభిప్రాయపడ్డారు. నగరంలోని రాయకోట రోడ్డు ముల్లైనగర్ ప్రాంతంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాకవి భారతీయార్ 143వ జయంతిని బుధవారం నిర్వహించారు. పారిశ్రామికవేత్త, వలంటీర్ రాజేంద్రన్ ఈ పాఠశాల కోసం అనేక విద్యాసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మహాకవి భారతీయార్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖాధికారిణి రమాదేవికి విద్యార్థులు స్వాగతం పలికారు. భారతీయార్‌గా పేరొందిన సుబ్రమణ్య భారతి తమిళ సాహిత్యానికి ఎనలేని సేవలందించి మహాకవిగా పేరొందారని వక్తలు పేర్కొన్నారు. విద్యార్థుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇదే సందర్భంగా గత ఏడాది 10,11,12 తరగతుల పరీక్షల్లో మొదటి మూడు స్థానాలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందచేసి ప్రశంసించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చెక్కుల అందచేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త ధేని రాజేంద్రన్, జిల్లా విద్యాశాఖాధికారిణి, ప్రిన్సిపాల్ గాంధీ పాల్గొన్నారు.

## గ్రామాల్లోకి ఏనుగులు రాకుండా చర్యలు



ఏనుగుల సంచారం

హోసూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలో దాదాపు 35 ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తున్నాయని ప్రజలు అప్రమత్తత పాటించి సురక్షితంగా ఉండాలని అటవీశాఖ హెచ్చరించింది. హోసూరు సానమావు అడవులో 35కు పైగా ఏనుగులు రెండు గుంపులుగా విడిపోయాయి. గ్రామాలలోకి ఏనుగులు రాకుండా అటవీశాఖ అధికారులు కార్యాచరణ చేపట్టారు. 20 ఏనుగుల గుంపును బుధవారం శివనంజుండేశ్వర కొండల గుండా డెంకణీకోట అడవుల్లోకి అటవీశాఖాధికారులు తరిమికొట్టారు. కెలమంగలం, జక్కేరీ పంచాయతీ పరిధిలోని ఒన్నగురుకి సమీపంలోని క్వారీ ప్రాంతంలో 15 ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్టు గుర్తించి గ్రామాలలోకి రాకుండా కట్టడి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏనుగుల కదలికలపై చర్యలు తీసుకుంటూ ముమ్మరంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో అడవులలో కట్టెలు సేకరణ, పశువులమేపేందుకు వెళ్లరాదని హెచ్చరించారు.

## ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో టిప్పు జయంతి



కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

హోసూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌డీపీఐ పార్టీ ఆధ్వర్యంలో టిప్పుసుల్తాన్ జయంతిని హోసూరు ఇమామ్‌బాడాలో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, రాతసామగ్రి పంపిణీ చేశారు. హోసూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ ఇయాజ్ అధ్యక్షత వహించారు. మండల కోఆర్డినేటర్ షబ్బీర్ అహ్మద్ అందరికి స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు షానవాజ్, హోసూరు ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అజంబాషా, వీర త్యాగి టిప్పుసుల్తాన్ కౌన్సిల్ రాష్ట్ర సంస్థ కార్యదర్శి సాల్మాన్, కార్యవర్గ సభ్యులు ప్రత్యేక అతిథులుగా హాజరై టిప్పు సుల్తాన్ సాధనలపై ప్రసంగించారు. నియోజకవర్గ అధ్యక్షుడు ఇంతియాజ్, కార్యదర్శి సాబీ, కోశాధికారి జుబీర్, అమ్ము, ఆబీషన్, ఇతర నిర్వాహకులు పాల్గొన్నారు.